క్లుప్తంగా

మత్తమాల పీహెచ్‌సీ పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాయాకల్ప బృందానికి చెందిన వైద్యులు గిరీష్ శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని ఫార్మసీ, ఇమ్యునైజేషన్, ల్యాబ్‌ను పరిశీలించారు. త్వరలోనే కాయాకల్ప బృందం ఆస్పత్రిని పరిశీలిస్తుందన్నారు. ఆస్పత్రిలోని లోటుపాట్ల గురించి వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, సిబ్బంది తదితరులున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ



మద్నూర్(జుక్కల్): ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు జావీద్ పటేల్ అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మైనారిటీలు ర్యాలీ నిర్వహించారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని ఆర్‌బీనగర్‌లోని ఇష్ట కార్య సిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు సుగంధ ద్రవ్యాలు, పూలతో అభిషేకాలు, అర్చన, హారతి, డోలోహరణం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు గంగవరం ఆంజనేయ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఐత బాలకిషన్, గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు నిత్యానందం, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చారి, భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను విక్రయించొద్దు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కల్తీకల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించొద్దని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు అన్నారు. కల్తీ కల్లు, గంజాయిని నిర్మూలించి మన సమాజాన్ని కాపాడుకుందాం అనే వాల్ పోస్టర్లను మండల కేంద్రంలోని కల్లు దుకాణాలలో శుక్రవారం అతికించారు. కార్యక్రమంలో ఎస్ఐ దీపిక, పోలీసు సిబ్బంది, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి పడిపోయిన ధాన్యం బస్తాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో లారీ నుంచి ధాన్యం బస్తాలు పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. నిజాంసాగర్ నుంచి కామారెడ్డికి ధాన్యం బస్తాల లోడుతో వెళ్తున్న లారీ నుంచి ఆకస్మాత్తుగా బస్తాలు పడి పోయినట్లు వారు తెలిపారు. లారీ వెనకాల ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని వారు తెలిపారు.

భూములకు పరిహారం ఇప్పించండి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి, ధర్మారావ్‌పేట్, అమర్లబండ గ్రామాల రైతులు కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయారు. భూములను కోల్పోతున్న రైతులకు పరిహారం మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు ఎమ్మెల్సీ కవితను కలిసి ఇప్పించాలని కోరారు. ఈవిషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రైతులు సురేశ్, సాయిలు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రయాణికుల కష్టాలు

- ఎల్లారెడ్డిలో పూర్తి కావచ్చిన బస్టాండ్ నిర్మాణ పనులు
- త్వరలో ప్రారంభించే అవకాశం



నిర్మాణం పూర్తయిన బస్టాండ్ లోపలిభాగం



ఎల్లారెడ్డి బస్టాండ్

ఎల్లారెడ్డి: పట్టణంలో బస్టాండ్ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే బస్టాండ్ ప్రారంభించనుండడంతో ప్రయాణికుల ఇబ్బందులకు తీరనున్నాయి.

రూ. 4.20 కోట్ల మున్సిపల్ నిధులతో బస్టాండ్ నిర్మాణం..

ఎల్లారెడ్డి బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరడంతో అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మున్సిపల్ నిధుల నుంచి 4.20 కోట్లు మంజూరు చేయించాడు. 2023 ఆగష్టులో అప్పటి మంత్రి కేటీఆర్‌తో నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికి చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాక పోవడంతో బస్టాండ్ నిర్మాణ పనులు నిలిచి పోయాయి. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులను మంజూరు చేయించడంతో తిరిగి బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బస్టాండ్ భవనం పూర్తి స్థాయిలో పూర్తి కావడం జరిగింది. కాంపౌండ్ వాల్ ప్లాస్టరింగ్ పనులు, సీసీ రోడ్డు పనులు వారం రోజుల్లో పూర్తి కానున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఐదు మండలాల కూడలి...

ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల ప్రజలకు ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణం పనులు పూర్తి కావడంతో అందరికి ప్రయోజనం చేకూరనుంది. ఎల్లారెడ్డి మీదుగా హైదరాబాద్‌తో పాటు కామారెడ్డి, బోధన్, బాన్సువాడ, పిట్లం మండలాలకు ప్రయాణికులు తరచూ ప్రయాణిస్తుంటారు. వీరందరు గత కొన్ని నెలలుగా బస్టాండ్ బయట ఎండలో వేడిని తట్టుకుని వర్షంలో తడిసి ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **15 రోజుల్లో ప్రారంభిస్తాం**
>
> ఎల్లారెడ్డి బస్టాండ్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. 15 రోజుల్లో బస్టాండ్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తాం. బస్టాండ్ పనులు మధ్యలో నిలిచి పోవడంతో మంత్రితో చర్చించి ప్రత్యేక నిధులను మంజూరు చేయించా. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బస్టాండ్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకుని వస్తాం.
>
> – మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే

సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మల్లూర్ ఉన్నత పాఠశాలలో ఖో ఖో ఆడుతున్న విద్యార్థులు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మండలాల విద్యాశాఖ అధికారులు అమర్‌సింగ్, తిరుపతి రెడ్డి సూచించారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్, నిజాంసాగర్ మండలం మల్లూర్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లను ఎంఈవోలు ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆన్‌లైన్ గేములు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా ఆటపోటీలు, యోగా వంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తలమడ్లలో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

తలమడ్లలో వాలీబాల్ క్యాంప్..

రాజంపేట: మండలంలోని తలమడ్ల జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు బాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఈటీ బాలు మాట్లాడుతూ. క్రీడలతో మానసిక ప్రశాంతత శరీర దృఢత్వం మెరుగవుతాయన్నారు. ఈ క్యాంప్ మే 31 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సావుసాని వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, రంగ భాస్కర్, మొకద్దం అశోక్, యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్, సావుసాని శివకుమార్, శ్రావణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, వడ్ల సిద్ధ రాములు, వడ్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా విడుదల



బంజపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ప్రదర్శిస్తున్న పంచాయతీ కార్యదర్శి భీంరావ్



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో..కమిషనర్ మహేష్‌కుమార్



బీబీపేటలో..

నిజాంసాగర్/బీబీపేట/ఎల్లారెడ్డి: నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లబ్ధిదారుల జాబితాను శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు విడుదల చేశారు. గ్రామ పంచాయతీల వారిగా లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాను గ్రామ పంచాయతీల్లో నోటీస్ బోర్డుపై అతికించామని పంచాయతీ కార్యదర్శులు భీంరావ్, గంగాసాగర్ తెలిపారు. అలాగే బీబీపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను గ్రామ పంచాయతీ ఆవరణలో జీపీ కార్యదర్శులు ప్రదర్శించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబందించిన జాబితాను నోటీసు బోర్డుపై అతికించారు. ఈకార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం తూకాలకు సహకరించాలి

నిజాంసాగర్(జుక్కల్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలకు రైతులు సహకరించాలని గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ నర్సింలు అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ సవాయిసింగ్, నాయకులు గోర్గంటి రాములు, కాశీరాం, శ్రీనివాస్, కాశయ్య, సాయిలు సొసైటీ సీఈవో రాములు, కేంద్రం నిర్వహకులు రాజు, రాజేందర్ తదితరులున్నారు.



నర్వలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ వైస్ చైర్మన్ నర్సింలు

కుళాయిల ఏర్పాటు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో నీటి వృథాను అరికట్టండి అనే శీర్షికన ఏప్రిల్ 19న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సరిత ఎస్సీ కాలనీ లో సింగిల్ ఫేజ్ మోటారుకు నీరు వృథా కాకుండా ట్యాప్ లను ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ అనే శీర్షికన ఏప్రిల్ 25న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సరిత శుక్రవారం కాలనీ లో మురుగు కాలువలు శుభ్రం చేయించారు. నీరు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, నీటి నిల్వ ఉండకుండా చూస్తామన్నారు.

‘పది’లో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన



ఎల్లారెడ్డి రూరల్: పట్టణానికి చెందిన ముత్తి ధరణీశ్వర్ పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చూపాడని స్థానికులు తెలిపారు. ధరణీశ్వర్ బోధన్‌లోని విజయసాయి పాఠశాలలో చదివి పదోతరగతిలో 582 మార్కులు సాధించాడు. ఈసందర్భంగా ధరణీశ్వర్‌ను శుక్రవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, ప్రవీణ్, వీరప్ప తదితరులున్నారు.

నేడు శాంతి ర్యాలీ

కామారెడ్డి టౌన్: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ప్రభుత్వ మావోయిస్టులతో చర్చలు జరపాలని పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్రె గుట్టల నుంచి పారా మిలటరీ బలగాలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలన్నారు.

చెరువు శిఖం కబ్జాను ఆపాలని వినతి

బాన్సువాడ : మండలంలోని హన్మాజీపేట్ పెద్ద చెరువు శిఖం భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, కబ్జాను వెంటనే ఆపాలని రైతులు శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సువర్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెద్ద చెరువు కింద వందల ఎకరాల ఆయకట్ట ఉందని, శిఖం భూమి కబ్జా అవుతుండటంతో ఇట్టి భూములకు భవిష్యత్‌లో సాగునీరు అందని పరిస్థితి ఉందన్నారు. చెరువు శిఖం భూమిని యంత్రాల సహాయంతో చదును చేస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ డీఈ జగదీష్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, రైతులు సాయిలు, సంజీవ్, ప్రవీణ్, వెంకగౌడ్, సాయిబాబా, జనార్దన్, నాగభూషణం తదితరులు ఉన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా గంగారెడ్డి



బాన్సువాడ : బీజేపీ బాన్సువాడ పట్టణ అధ్యక్షుడిగా కోనాల గంగారెడ్డిని నియమించినట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బాన్సువాడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ముజాహిద్



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ ఇన్‌చార్జి మండల పరిషత్ అధికారిగా ముజాహిద్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బాన్సువాడ ఎంపీడీవోగా పని చేసిన బషీరోద్దీన్ పదవీ విరమణ పొందారు. దీంతో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముజాహిద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

బాన్సువాడ : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పదో తరగతిలో డివిజన్ టాపర్‌గా నిలిచిన వాసవీ స్కూల్ విద్యార్థి సహస్రను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో డివిజన్ స్థాయిలో 600 మార్కులకు గాను 576 మార్కులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల యాజమన్యం సహస్రకు రూ.11 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు మోటమర్రి నాగరాజు, రామకృష్ణ, కరస్పాండెంట్ విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ లక్ష్మి, శ్వేత, ఉపాధ్యాయులు జలీల్, శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.



బాన్సువాడ డివిజన్ టాపర్‌ను అభినందిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాట్రోత్ నందు, మాలోత్ జగన్‌లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని కెడి సింగ్ బాబూ స్టేడియం బరంబంకీలో ఈ నెల 29న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాలం బాయి, వీడీసీ చైర్మన్ గుడ్ల శ్రీకాంత్, ఉపాధ్యాయులు బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

విద్యుత్ మరమ్మతుల్లో జాగ్రత్తలు పాటించాలి



బిచ్కుందలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు



లింగంపేటలో..

- డీఈ ప్రభాకర్
- విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బిచ్కుంద/లింగంపేట : విద్యుత్ మరమ్మతులు చేసేటప్పుడు ప్రమాదాలు సంభవించకుండా సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ డీఈ ప్రభాకర్ అన్నారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బిచ్కుంద రైతు వేదికలో విద్యుత్ సిబ్బంది, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటారు స్టాటర్ బోర్డు వద్ద దగ్గర ఎర్తింగ్ తప్పకుండా ఉండే విధంగా చూడాలని, విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మరమ్మతులు చేయవద్దని కోరారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే లింగంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను విద్యుత్ శాఖ డీఈ విజయసారథి ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో టెక్నిషియన్ ఏడీఈ సంజీవ్, ఏడీఈ మల్లేశ్, సబ్ ఇంజనీర్‌లు అశోక్, భాస్కర్, ఏఈ పవన్, సబ్ ఇంజనీర్ రమేష్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామపంచాయతీ కార్యాలయాలలో రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని జప్తిజాన్కంపల్లి, మెల్లకుంటతండా గ్రామాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. దీంతోపాటు ఆయా గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల నిర్వాహణతీరును పరిశీలించి, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడ కూడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు.ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు శంకర్, పవిత్ర ఉన్నారు.



మెల్లకుంటతండాలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

సంక్షిప్తం

బీజేపీ మండలాల అధ్యక్షుల నియామకం

కామారెడ్డి టౌన్ : బీజేపీ పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా బాన్సువాడ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నూతన అధ్యక్షులను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా చందూరి హన్మంతు, బాన్సువాడ కు కొంగల గంగారెడ్డి, వర్ని మండల అధ్యక్షుడిగా ఆవుల రమేష్, పొతంగల్ అధ్యక్షుడిగా కల్లూరి హన్మండ్లులను అలాగే జిల్లా కౌన్సిల్ సభ్యులుగా సున్నం సాయిలు, మక్కయ్య, తిరుపతిప్రసాద్, శంకర్‌లను నియమించినట్లు తెలిపారు.

చిన్న మల్లారెడ్డి గ్రామ మాల నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన మాల కులస్తుల గౌరవ అధ్యక్షుడు బొలిగద్ద పోచయ్య, బొలిగద్ద బాలరాజు ఆధ్వర్యంలో మాల కుల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లిగద్ద శివరాజు, ఉపాధ్యక్షుడిగా సుతారి సుధాకర్, కార్యదర్శిగా బొలిగద్ద పెద్ద కృష్ణ, కోశాధికారిగా బొలిగద్ద గోపాల్, సలహాదారులుగా బొలిగద్ద రాములు, బొలిగద్ద రాజు, బొలిగద్ద నంబర్ శివ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ నేతల చిత్ర పటానికి క్షీరాభిషేకం



బాన్సువాడ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి శుక్రవారం బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కేబినెట్ జనగణనతో పాటు కులగణన చేయాలని ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలిబిన్ అబ్దుల్లా, ఖలేక్, అసద్, పవన్, మధుసుధన్‌రెడ్డి, అఫ్రోజ్, మన్సుర్, అజీం. రైయిస్, రమేష్, గౌస్, షాహబ్, హన్మండ్లు, నగేష్, ఖాసీం తదితరులున్నారు.

గాలికుంటు నివారణ టీకాలను వేయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామంలో శుక్రవారంపశువైద్యశిబిరం ఏర్పాటు చేసి ఆవులు, గేదేలకు గాలికుంటూ నివారణ టీకాలను వేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు కిష్టరెడ్డి, కార్యదర్శి సాయిరెడ్డి, వైద్య సిబ్బంది, పోచయ్య, కొండల్‌రెడ్డి, ప్రేంసింగ్, గోపాల మిత్ర మహిపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విఠలేశ్వర ఆలయాన్ని సందర్శించిన దండి పీఠాధిపతి

బాన్సువాడ : బీర్కూర్ మండలం భైరాపూర్ శ్రీ రుక్మిణి సమేత విఠలేశ్వర మందిరాన్ని శుక్రవారం దండి పీఠాధిపతి శ్రీ సుదర్శన స్వామిజీ సందర్శించారు. రుక్మిణి, విఠలేశ్వర దేవతల నూతన విగ్రహా ప్రతిష్టాపనకు సంబంధించిన విషయాలను ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ద్రోణవల్లి సతీష్, సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, మోహన్, వెంకట్, సాయిలు, శంకర్, రాజు, సతీష్ తదితరులున్నారు.